## బొజ్జా అరెస్టుకు నిరసనగా రైతుల రాస్తారోకో..!

**(మొదటి పేజీ తరువాయి ) :**సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైయస్ రెడ్డి, సీనియర్ న్యాయవాది బి శంకరయ్య, వైసీపీ రైతు నాయకులు బెక్కెం రామసుబ్బారెడ్డి, ఇప్పల చిన్న తిరుపతిరెడ్డి టిడిపి రైతు నాయకులు బాలీశ్వర్‌రెడ్డి, బాబు, గడివేముల మండల రైతుల నాయకులు సంజీవ‌రెడ్డి, పాణ్యం రైతు నాయకులు మురళీధర్‌రెడ్డి, అభిరాం, శ్రీనివాసరెడ్డి, బండిఆత్మకూరు మండల నాయకులు రామకృష్ణారెడ్డి,మున్సిపల్‌కార్మిక సంఘ నాయకులు షణ్ముఖరావు తదితరులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సంగమేశ్వర పుణ్యక్షేత్రం సమీపంలోని సిద్దేశ్వరం గ్రామం వద్ద కృష్ణనదిపై అలుగునిర్మిస్తే సుమారు 60 టిఎంసి నీరు నిలిచి రాయలసీమ ప్రాజె క్టుకు అందుతాయన్నారు. రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేధిక పిలుపుమేరకు బొజ్జా దశరథరామిరెడ్డి నాయకత్వంతో 2016 మే 31 రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల నుండి సుమారు 35 వేల మంది స్వచ్ఛదంగా తరలివచ్చి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం ప్రజాశంఖుస్థాపన చేశారని గుర్తుచేశారు. అనాటి కేసులో ఇప్పుడు బజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టుచేశామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అరెస్టులతో రాయలసీమ ఉద్యమకారుల గొంతు నొక్కలేరని బొజ్జా దశరథరామిరెడ్డని బేషరతుగా విడుదల చేసి కేసులు రద్దుచేయాలని జగన్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి కర్నాటకలో అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టును ఆపాలని తెలంగాణకు మేలు చేసే కృష్ణానది నీటి తరలింపు నల్ల చట్టాలు రద్దుచేయించాలని కర్నూలులో కెఆర్‌ఎంబిని ఏర్పాటు చేయాలని, రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనిరసన కార్యక్రమంలో కొమ్మా శ్రీహరి, పట్నం రాముడు, రాఘవేంద్ర, నారాయణ గౌడ్, రామేశ్వర్‌రెడ్డి, మునగాల మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మింగలేక.. కక్కలేక..

**(మొదటి పేజీ తరువాయి ) :**అన్నింటా వాలంటీర్ల సేవలు విరివిగా అందుతున్నాయన్న భ్రమలో ఉన్న ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం సచివాలయ ఉద్యోగులపై పరోక్షంగా ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. నిబంధనల మేరకు ఆడుదాం ఆంధ్రలో క్రీడాకారులను ఆటలాడించి.. విధాన పరంగా స్కోర్లు వేయించాల్సిన పీఈటీలు ఆ వ్యవహారాల్లో తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండాన్ని సచివాలయ ఉద్యోగులు ముఖ్యంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న వారు దీనిని జీర్ణించుకోలేక పోతున్నారు.. దీంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఏదోలా 'మమ' అనిపించేయడం సచివాలయ ఉద్యోగులకు అనివార్యమైందని పరిస్థితులు చెబుతున్నాయి.. ఆటలాడించడం ఒక ఎత్తయితే వాటికి స్కోర్లు వేయడం.. వాటిని అప్‌లోడ్ చేయించడం వంటివి మరో ఎత్తున ఆ బాధ్యతలతో సతమతమవుతున్నట్లు వారు విసుక్కుంటున్నారు.. పీఈటీలకు పూర్తి బాధ్యతలు అప్పజెప్పాలన్నా స్పృహలో అధికార యంత్రాంగం లేకపోవడాన్ని వారు తప్పు పడుతున్నారు.. ఇదిలా ఉంచితే వాలంటీర్లు ప్రతి రోజూ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంటారన్న నమ్మకంతో మండల స్థాయి అధికారులు మొదలుకుని ముఖ్యమంత్రి వరకు వాలంటీర్ల సేవలపై అతిగా ఊహించుకుంటున్న పరిస్థితిలపై కూడా సచివాలయ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయకుండా ప్రతీ పథకానికి వాలంటీర్లతో ముడిపెట్టడం వల్ల పరోక్షంగా సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తడికి గురవుతున్నారన్నది వారిలో అధిక సంఖ్యాకుల వాదన.. అయితే తమ వేదన మండల స్థాయి ఉన్నతాధికారులకు పంచుకోలేక.. జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయలేక..అంటే మింగలేక.. కక్కలేక కాలాన్ని వెలిబుచ్చుతున్నట్లు పరిస్థితులు చాటిచెబుతున్నాయి.. ముఖ్యంగా వెల్ఫేర్ అసిసెంట్, డిజిటల్ అసిస్టెంట్లు తీవ్ర ఒత్తడికి గురవుతున్నట్లు తెలుస్తోంది..దీనికి తోడు ప్రస్తుతం సచివాలయాల్లో సిబ్బంది అంతంత మాత్రంగానే ఉంటున్నారు.. ఎక్కువ శాతం మంది సచివాలయ ఉద్యోగులు బదిలీలపై వెళ్లడంతో వారి స్థానాలు ఇప్పటికి భర్తి కాలేదు.. దీంతో ఉన్న వారితోనే ప్రభుత్వ పనులను నెట్టుకొస్తున్నారు.. ఈలాంటి విపత్కర పరిస్థితులలో రెండు గుర్రాలపై స్వారీ ఎలా చేయాలో తెలియని పరిస్థితి నెలకుందని వారు వాపోతున్నారు.. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యాయనం చేసి ఎవరికి ఏ పని అప్పజెప్పాలో గ్రహించి ఆ మేరకు కార్యక్రమాలను ముందుకు నడిపించి విజయవంతం చేయాల్సిందిగా పలువురు సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు..

## నిరంకుశ పాలన చేస్తున్న వైఎస్ జగన్

**కర్నూలుకలెక్టరేట్,జనవరి3,ప్రభాతవార్త:** గత ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని హామీ ఇచ్చారని అలాగే జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ అధికారంలోకి వస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించుకు వస్తామని రాష్ట్ర ప్రజలను ఇద్దరు మోసం చేశారని ఆంధ్రప్రదేశ్ కాం గ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మస్తాన్ వలి విమర్శించారు.బుధవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మస్తాన్ వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దశదిశానిర్దేశం చేయడానికి వచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిందని రాష్ట్రాన్ని అప్పులమయంగా చేశారని ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో పది లక్ష కోట్లు అప్పులు చేశారని రాష్ట్ర ప్రజలను వంచించి మోసం చేశారని అహంకారపూరిత,నిరంకుశ పాలన వల్ల ఆంధ్ర రాష్ట్ర పరువును,గౌరవాన్ని ప్రధాన మంత్రి మోదీ కాళ్ళ వద్ద తాకట్టుపెట్టారని,రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టు అవార సంజీవని చెప్పి దాదాపు రెండున్నర కోట్ల మందికి సాగు,తాగునీరు జాతీయ ప్రాజెక్టుగా పరిగణించిన ప్రాజెక్టు కమిషన్ల కక్కుర్తి కోసం ఆనాడు చంద్రబాబు,నేడు జగన్‌మోహన్‌రెడ్డి ఇంతవరకు ప్రాజెక్టు పూర్తి చేయలేదని ప్రభుత్వాలు మారాయని కాంట్రాక్టర్లు మారారు కాని ప్రాజెక్టు మాత్రం పూర్తికాలేదని ప్రాజెక్టు పేరుతో కమిషన్లకు కక్కుర్తిపడి ప్రజా సంపదను దోచుకుంటున్నారని వీరి వాళ్ళ రాష్ట్రానికి జరిగిందేమీలేదని మరియు మూడు రాజధానుల పేరుతో కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేస్తానని రాయలసీమ ప్రజలను మోసం చేశారని విమర్శించారు.రాబోవు ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి సంతకం ప్రత్యేక హోదా ఫైలు పై పెట్టి తెలుగు ప్రజల ముందుకు వస్తామని రాహుల్ గాంధీ తెలిపారని ఈ సందర్భంగా మస్తాన్ వలి తెలిపారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ మరియు జిల్లా కాంగ్రెస్ సంయుక్త సమావేశం జిల్లా కాం గ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబూరావు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గాల వారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మం త్రి మారెప్ప,పీసీసీ ఉపాధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు,పీసీసీ ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మీనారాయణరెడ్డి,దామోదరం రాధాకృష్ణ,పీసీసీ అధికార ప్రతినిధి ఏ.కరుణాకర్‌బాబు,జిల్లా కాంగ్రెస్ ముఖ్యనాయకులు,మైనార్టీ నాయకులు,మహిళా నాయకులు,కా ం గ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాచేపల్లెలో 33/11కెవి నూతన ఉప విద్యుత్ కేంద్ర సేవలు



**ఆళ్లగడ్డ, జనవరి 3, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె అహోబిలం రోడ్డులో నూతనంగా 4.52 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని బుధవారం ఏపీ జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ శాసన సభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి,ఏపీఎస్పీడిసిఎల్ డైరెక్టరు శశికళారెడ్డిలు ప్రారంభించారు. అనంతర ం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేసి పంటల సాగుకు అవసరమైన విద్యుత్‌ను అందించడానికి విద్యుత్ ఉప కేంద్రాలు నిర్మించి రైతుల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత ్వం అన్నివిధాల, అన్నివర్గాల ప్రజలను అదుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రజల అభివృద్దే ధ్యేయంగా గంగుల కుటుంబం ప్రజా సేవలో ముందుకు సాగుతుందని వారు తెలిపారు. అనంతరం సబ్‌స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి, ఈఈ రమణారెడ్డి, డిఈలు ఎస్వీ రాజేష్, లత, ఎడి రవికాంత్ చౌదరి, ఎడిలు, ఎఈలు, సిబ్బంది, బాచెపల్లి ఎంపిటిసి కశెట్టి నాగేశ్వర్‌రావు, స్థలదాత కశెట్టి పెద్దయ్య, మాజీ ఎంపిటిసి మూడే రామానాయక్, సచివాలయ కన్వీనర్ కశెట్టి నాగేంద్ర,డీలర్ కశెట్టి నాగయ ్య, వైకాపా నాయకులు రాటాల శ్రీనివాసులు, కాంట్రాక్టరు శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బనగానపల్లెలో ఘనంగా ఉరుసు వేడుకలు



**బనగానపల్లెరూరల్,జనవరి3,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక పాతబస్టాండ్ సమీపంలో గల హజరత్ సయ్యద్ సిద్దిఖ్ జలాల్ రహమతుల్లా అలైహి,బరియుద్దిన్ షా ఖాద్రీ రహమతుల్లా అలైహి,హజరత్ సయ్యద్ మీర్ హసం అలీ ఉరుసు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగానే హజరత్ సయ్యద్ ఉసేని బాషా ఖాద్రీ శుప్తరి యమని సాహెబ్‌తో కలిసి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆయన సోదరుడు బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఫాతేహాలను సమర్పించారు.అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన వితరణ గావించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సోదరులు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వజన వైద్యశాలలో కేషీట్ టెండర్స్

**కర్నూలు అర్బన్, జనవరి 3, ప్రభాతవార్త:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కేషీట్ టెండర్స్ విషయమై నలుగురు సిబ్బంది పాల్గొన్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. ఎన్ఎబిహెచ్ నార్మ్స్ మరియు ఇన్ పెషెంట్ కొరకు వాడే కేషీట్ టెండర్స్‌ను సూపరింటెండెంట్, కమిటీ సభ్యుల మధ్య సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఓపెన్ చేయడం జరిగింది. శ్రీనివాస ఎంటర్‌ప్రైజస్ కర్నూలు వారు టెండరును ఒక్కొ కేషీట్ రూ.16.10 దక్కించుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటి సూపరింటెండెంట్ డా.ప్రభాకర్‌రెడ్డి, సిఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వర్‌రావు, ఆసుపత్రి ఏడి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**గడివేముల, జనవరి03, ప్రభాతవార్త;** గత 20 రోజుల నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం నాయకురాలు వసంతలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. వారు చేపట్టిన సమ్మె 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యవసర ధరలు ఆకాశానికి పెరిగిన సందర్భంలో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని, అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు రూ.5 లక్షలు గ్రాట్యుటీని అమలు చేయాలని, అంగన్‌వాడీలు సర్వీసులో ఉండి చనిపోయే కారుణ్య నియామకాల ప్రకారం వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను మానసిక ఒత్తిడికి గురి చేసే అనేక రకాలైన యాప్‌లను తగ్గించాలని, సర్వీసులో ఉండి అంగన్‌వాడీలు చనిపోతే కనీసం మట్టి ఖర్చులకు కూడా ఇవ్వడంలేదని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా అంగన్‌వాడీలకు అమలు చేయడంలేదన్నారు. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, డీఏ బిల్లులు ఇతర బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## ఏపీయుఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి

**ఉయ్యాలవాడ,జనవరి3,ప్రభాతవార్త:** ఉయ్యాలవాడ మండల పరిధిలో ఉన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయుస్)ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు వేదూరి సుధాకర్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నాంగౌల్‌లో సావిత్రిబాయి పూలే జన్మించినద్నారు.తొమ్మిదేళ్ల వయస్సులో జ్యోతిరావు పూలేను వివాహామాడిందన్నారు.నిరక్ష్యరాసులుగా ఉన్న సావిత్రిబాయికి భర్త జ్యోతిరావుపూలే మొదటి గురువుగా ఉండి విద్యాజ్ఞానం నేర్పి సమాజానికి మహిళా ఉపాధ్యాయునిరాలుగా తీర్చిదిద్దరన్నారు.1847 నాటికి భర్తతో కలిసి శుద్ర కులాల బాలికల కోసం పూణెలో మొదటి పాఠశాలను ప్రారంభించారన్నారు.ఈ పాఠశాలను నడపడం అగ్రకులాలకు నచ్చలేదన్నారు.దీంతో సావిత్రిబాయి పూలే పై వేధింపులకు,దాడులకు పూనుకున్నరన్నారు.అగ్రకులస్థులు అందరు కలిసి పాఠశాలను నడపవద్దని ఆమె పై ఒత్తిడి తెచ్చిన ఆమె వినకుండా పాఠశాలను నడిపిందన్నారు.1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే అతని అంత్యక్రియలు జరిపేందుకు అగ్రకులస్థులకు భయపడి తన బంధువులు ఎవరు రాలేదన్నారు.అటి పరిస్థితుల్లో కూడా ఆమె భయపడకుండా భర్త చితికి నిప్పటించిందన్నారు.జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన సాంప్రదాయమన్నారు.ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాన్ని శాలువలతో,పూలమాలలతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి బుజ్జిబాబు,హరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రార్థన ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి,ఉయ్యాలవాడ మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయు 75వ వజ్రోత్సవ గోడపత్రిక విడుదల

**చాగలమర్రి,జనవరి3,ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండల విద్యాశాఖ అధికారి న్యాంతుల్లా ఎస్టీయు 75వ వజ్రోవత్స గోడపత్రికను బుధవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా చాగలమర్రి మండల అధ్యక్షులు మస్తాన్ బాషా,ప్రధాన కార్యదర్శి సుబ్బారావు,ఆర్థిక కార్యదర్శి మహబూబ్ సేన్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా వజ్రోత్సవాలను జనవరి 12,13వ తేదిల్లో కర్నూలు నందు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులందరూ తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు శివశంకర్,ప్రసాద్,ఎస్టీయు నాయకులు శేషాద్రి,రాజశేఖర్‌రెడ్డి, నరసింహులు,సురేశప్ప,మహబూబ్ బాషా,కృష్ణశాస్త్రి,గౌస్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**చాగలమర్రి,జనవరి3,ప్రభాతవార్త:** చాగలమర్రిలోని పాతబస్టాండ్ కాలనీలో ఉన్న అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 193 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎంఎస్ అన్సర్ బాషా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చేసిన సేవలను ఆయన కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు షబ్బీర్,జైనుల్లా,మహబూబ్‌సాప్,విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పై ప్రత్యేక నిఘా ఉంచండి - డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

**పత్తికొండ,జనవరి3,ప్రభాతవార్త:** పత్తికొండ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పై,పాత నేరస్థుల కదలికల పై ప్రత్యేక నిఘా ఉంచాలని డివిజన్ పరిధిలో ఉన్న పోలీసులకు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజల శాంతియుత జీవనానికి భంగం కలిగించే వ్యక్తులు,రౌడీషీటర్లు,అల్లర్లకు పాల్పడే వ్యక్తులకు అలాగే పేకాట,మట్కా,నాటుసారా కేసుల్లో పట్టుబడిన పాతనేరాస్థులకు మళ్లీ అటువంటి చర్యలకు పాల్పడకుండా ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆయన సూచించారు.పత్తికొండలో ఆరు మంది రౌడీలు,ఆరు మంది అనుమానిత వ్యక్తులు,కేడీ ఒకరు,ఎస్పే ఒకరు మొత్తం 14 మంది,మద్దికెర మండలంలో రౌడీషీటర్లు 3,అనుమానిత వ్యక్తులు 14 మంది,డీకే దొంగలు 4,ఎస్పే ఇద్దరు మొత్తం 23 మంది,తుగ్గలిలో మండలంలో 19 మంది రౌడీషీటర్లు,అనుమానిత వ్యక్తులు 10 మంది,దొంగలు ఇద్దరు మొత్తం 31 మంది,జొన్నగిరి మండలంలో రౌడీలు 6 మంది,అనుమానిత వ్యక్తులు 12 మంది,దొంగలు 1,ఎస్పే 5 మంది మొత్తం 24 మంది,కృష్ణగిరిలో 29 మంది రౌడీలు,అనుమాని వ్యక్తులు 11 మంది,దొంగలు ఇద్దరు,ఎస్పే 5,బీఎం ఇద్దరు మొత్తం 49 మంది,వెల్దుర్తిలో రౌడీలు 43మంది,అనుమానిత వ్యక్తులు 31మంది,కేడీ 1,బీఎం 1 మొత్తం 76మంది,ఆలూరు రౌడీలు 16,అనుమానిత వ్యక్తులు 34 మంది మొత్తం 50 మంది,ఆస్పరి రౌడీలు 77,అనుమానిత వ్యక్తులు 31,ఎస్పే 3 మొత్తం 111మంది,చిప్పగిరి రౌడీలు 29 మంది,అనుమానిత వ్యక్తులు 20మంది,ఎస్పే 3మొత్తం 52 మంది,హోళగుంద రౌడీలు 21,అనుమానిత వ్యక్తులు 36మంది మొత్తం 57 మంది,హాలహర్వి రౌడీలు 51,అనుమానిత వ్యక్తులు 13 మంది,కేడీ 1 మొత్తం 65 మంది,దేవనకొండ రౌడీలు 44 మంది,అనుమానిత వ్యక్తులు 24మంది,కేడీలు ఇద్దరు,ఎస్పే 4,క్రిమినల్స్ 5మంది మొత్తం 79మంది పత్తికొండ డివిజన్ పరిధిలో మొత్తం 631 మంది ఉన్నారని తెలిపారు.ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వీరి పై నిఘా ఉంచాలని ఆయన సూచించారు.ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా,అలర్లు జరగకుండా ముందుగానే అదుపులోకి తీసుకోవాలని తెలిపారు.

## అయ్యో పాపం చిన్నారులు...

**–తాళం వేసిన అంగన్వాడీ కేంద్రం ముందు అన్నం కోసం....**

**–ఖాళీ ప్లేట్లతో అరుగుపై కుర్చున్న చిన్నారులు**

**గోనెగండ్ల జనవరి 3 ప్రభాతవార్త :** అయ్యో పాపం పసిపిల్లలు గతంలో సరదాగా అడుకొని చదువుకొని అన్నం తిన్న కేంద్రం అది. ఈరోజు కూడా ప్రతి రోజు మాదిరే అన్న ం పెడతారని చిన్నారులు ప్లేట్లు,గ్లాసులు తీసుకువచ్చి అంగన్వాడీ కేంద్రం ముందు కుర్చున్నారు.అయితే ఆ అంగన్వాడీ కేంద్రంకు తాళం వేసి ఉంది. అది తెలుసుకోలేని చిన్నారులు,మద్యహ్నాం వరకు వేచిచూసి కడుపు మాడ్చుకొని చిన్నారులు ఇండ్లకు వెళ్లిన సంఘటన హెచ్ కైరవాడి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం 3లో చోటు చేసుకుంది.హెచ్ కైరవాడి గ్రామంలోని బీసీ కాలనీలో అంగన్వాడీ కేంద్రం 3ఉంది. అయితే గత 23 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు నిరవదిక సమ్మె చేస్తున్నారు.దీంతో కేంద్రం నిర్వహణ బాధ్యతలను సచివాలయ సిబ్బందికి అధికారులు అప్పజెప్పారు.అయితే బుధవారం ప్రతి రోజు మాదిరి దాదాపు 20 చిన్నారులు ప్లేట్లు,గ్లాసులు తీపుకొని అంగన్వాడీ కేంద్రం కు వచ్చారు.అక ్కడ సచివాలయ సిబ్బంది ఎవ్వరు లేక పోవడంతో కేంద్రంకు తాళం వేసి ఉంది. చిన్నారులు మాత్రం అరుగుపై కుర్చున్నారు.మధ్యహ్నాం అయినప్పటికి భోజనం రాక పోవడంతో చిన్నారులు ఖాళీ కడుపుతో వెనుతిరిగారు.

## అవ్వా తాతలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకొన్న వైకాపా ప్రభుత్వం



– రాష్ట్రప్రభుత్వం పెంచిన రూ.3వేల పించన్‌సొమ్మును అందచేసిన ఎంఎల్‌ఏ తొగూరు ఆర్థర్

**పాములపాడు రూరల్, జనవరి3,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అవ్వా,తాతలకు రూ.3వేల పింఛన్ ఇస్తామని హామి ఇచ్చి మాట నిలమెట్టుకిందని ఎంఎల్‌ఏ తొగూరు ఆర్థర్ తెలిపారు.మండల కేంద్రమైన పాములపాడులోని ఎంపిడివో కార్యాలయయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వం రూ.3వేలకు పెంచిన పింఛను సొమ్మును ఎంఎల్‌ఏ వృద్ధులకు అందచేశారు.ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వైకాపా 4ఏళ్ల పాలన కాలంలో సంక్షేమం,అభివృద్ధికి పెద్దపీట వేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు ఎంఎల్‌ఏ కొనియాడారు.కార్యక్రమంలో ఎంపిపి తొగూరు వర్జీనీయ,వైస్‌ఎంపిపి బండ్లమూరి వెంకటేశ్వర్లు,రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ కార్పొరేషన్ డైరక్టర్ రామసుబ్బయ్య,కో–ఆప్టెడ్ మెంబరు సర్పంచులు మౌలాలి,రామస్వామి,మాణిక్యమ్మ,వైకాపా నాయకులు రాములమ్మ,శెట్టి శివలింగం,షెక్‌షావలి,ఓబులప్రెడ్డి,మండలాధికారులు తహసిల్దార్ రత్నరాధిక,ఎంపిడివో గోపికృష్ణ,ఏపియం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

**మద్దూరులో రూ.4.8లతో సిసి రహదారికి భూమి పూజ చేసిన ఎంఎల్‌ఏ :**మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో రూ.4.8 లక్షలతో నిర్మించ తలపెట్టిన సిసి రహదారి నిరా ్మణానికి ఎంఎల్‌ఏ భూమి పూజ చేశారు.

## అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపిన సావిత్రిభాయ్ పూలే

**ఆలూరు,జనవరి 3,ప్రభాతవార్త :** అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సర్వస్వం త్యాగం చేసిన దంపతులు జ్యోతిరావు పూలే,సావిత్రిభాయ్ పూలే అని ఎస్‌టియు రాష్ట్ర నాయకులు బంటనహాల్ నాగరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుంబళబీడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుల తల్లి సావిత్రిభాయ్ పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే,సావిత్రిభాయ్ పూలేలు చేసిన కృషి వల్ల నేడు ఈ సమాజంలో ప్రతిఒక్కరు అక్షరాలు నేర్చుకోగలుగుతున్నారన్నారు. భర్త అడుగుజాడల్లో నడిచి సంఘంలో జరుగుతున్న అనేక అణచివేతలను ఎదురించిన ధీశాలి సావిత్రిభాయ్ పూలే అన్నారు. ఆమె మహారాష్ట్రలోని సాసరా జిల్లాలో నయాగౌవ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న ఒక రైతు కుటుంబంలో జన్మించిందన్నారు. సావిత్రిభాయ్ పూలే అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి కృషి చేశారన్నారు. బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు,సతీసహగమనానికి వ్యతిరేకంగా,వితంతు పునర్ వివాహాల కోసం,అసమాన వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, రమణారెడ్డి,సూర్యనారాయణ,వన్నూర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఏపిఎన్జీవోస్ తాలుకా యూనిట్ క్యాలెండర్ విడుదల

**నందికొట్కూరు,జనవరి 3,ప్రభాతవార్త:** పట్టణంలోని ఎన్జీవో భవనం నందు ఏపిఎన్జీవోస్ నందికొట్కూరు తాలుకా యూనిట్ టేబుల్ క్యాలెండర్‌ను యూనియన్ అధ్యక్షులు రాముడు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ విడుదల చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతు ప్రభుత్వం 12వ పి.ఆర్,సి.పి వెంటనే అమలు చేయాలని, అంత కంటే ముందుగా ఐ.ఆర్.ను ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉపాధ్యాక్షులు రాజశవేఖర్, మాదన్న, సహాయ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ వరలక్ష్మి, వెంకట్‌లత, ఈసిమెంబర్ చెంచన్న, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు

**దేవనకొండ,జనవరి 3,ప్రభాతవార్త :** తమ డిమాండ్ల సాధన కోసం గత 22రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ తమ డిమాండ్లపై ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న దేవనకొండ,ఆలూరు,ఆస్పరి మండలాల అంగన్‌వాడీలను దేవనకొండ పోలీసులు ఈదుల దేవరబండ దగ్గర అడ్డుకుని కలెక్టరేట్ పోకూడదని నిలువరించారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు,సిఐటియు నాయకులు తమ సమస్యల పరిష్కారం కొరకు కలెక్టరేట్‌కు వెళ్లి తీరుతామని పట్టుబట్టారు. పోలీసులు అడ్డుకోవడంతో ఈదుల దేవరబండ దగ్గర రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి నారాయణస్వామి,దేవనకొండ మండల కార్యదర్శి అశోక్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్య పరిష్కారం వైపు ప్రయత్నించాలి కానీ నిర్బంధం పెడితే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. నారాయణస్వామి,అశోక్‌లను బలవంతంగా పోలీస్ జీపు ఎక్కించి అరెస్టు చేయడంతో కార్యకర్తలు మూకుమ్మడిగా అడ్డుపడి నాయకులను వదిలిపెట్టాలని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు సిఐటియు నాయకులతో మాట్లాడి రాస్తారోకో విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాతమ్మ,జయశ్రీ,భారతి,సరస్వతీ, లక్ష్మి,ప్రభావతి తదితరులున్నారు.

## విజయవాడ సమ్మెకు అనుమతి ఇవ్వండి

**హొళగుంద,జనవరి 3,ప్రభాతవార్త :** రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 4వ తేదీన విజయవాడలో జరుగు సమ్మెకు అనుమతి ఇవ్వాలని హొళగుంద మండల ఫీల్డ్ అసిస్టెంట్లు దేవప్పకన్నయ్య, పరమేష్,అనిల్,ఈశ్వర్,ఉలిగప్పలు బుధవారం ఎంపిడిఓ సుహాసిని,ఏపిఓ భక్తవత్సల్యంకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హొళగుంద మండలానికి చెందిన అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ నెల 4న విజయవాడలో జరుగు సమ్మెకు తాము వెళ్లుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. తాము సమ్మెలో పాల్గొన్నప్పటికీ గ్రామంలో జరుగు జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండ మేటీలకు చెప్పామన్నారు. అలాగే ఎన్ఎంఎంఎస్ సక్రమంగా ఉండేటట్లు చూసుకుంటామని పేర్కొన్నారు. వెంకటేష్,రంజాన్‌సాబ్,పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్

**పగిడ్యాల, జనవరి 3,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పగిడ్యాల విద్యాశాఖాధికారి కార్యాలయం సమావేశభవనంలో బుధవారం యూటీఎఫ్ నూతన డైరి,క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్, మండల విద్యాశాఖాధికారి –2,మురళీమోహన్‌రెడ్డి అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ మండల అధ్యక్షులు ఐ.రంగస్వామి, ప్రధానకార్యదర్శి సత్యనారాయణరావు, ఉపాధ్యక్షులు ఎ.వేదవ్యాసు,ఆర్థిక కార్యదర్శి బి.మల్లికార్జున, సహాయ కార్యదర్శులు పి.శ్రీనివాసులు, అబుఖాసీం, పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య చికిత్సలు

**ఆదోని,జనవరి 3,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఆరోగ్యశ్రీ ద్వారా అధునాతనమైన వైద్య పరికరాలతో మెరుగైన చికిత్సలు అందించడం జరుగుతుందని జెసిఎస్ టౌన్ కన్వీనర్,కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. పట్టణంలోని 39వ సచివాలయంలో అర్హులైన వారికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు యువ నాయకుడు జయమనోజ్‌రెడ్డి సహకారంతో బుధవారం నూతన ఆరోగ్యశ్రీ కార్డులు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాలకు ఆరోగ్యశ్రీలో వైద్యచికిత్సల నిమిత్తం రూ.25లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. ఆరోగ శ్రీ ద్వారా ఇంకా మెరుగైన వైద్యం అందించే దిశగా సిఎం జగన్ అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది చిన్న రాజు,గౌస్,రాజశేఖర్,పద్మావతి, లక్ష్మి,వాలంటీర్లు,ఏరియా ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లా వైయస్ఆర్ పెన్షన్ కానుక

**నంద్యాల క్రైం, జనవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా వైయస్ఆర్ పెన్షన్ కానుక ఉత్సవాల్లా జరిగాయని ఠక్షన్‌గా 1వ తేదినే లబ్దిదారుని ఇంటివద్దకు దరిచేరుతున్నాయని నంద్యాల శాసన సభ్యులు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయ అవరణలో వైయస్ఆర్ పెన్షన్ కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన మున్సిపల్ కమిషనరు రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీదర్, పాంషావలిలు పాల్గొన్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన సభ్యులు హాజరయ్యారు. రాష్ట్రంలోని అర్హులైన అవ్వా తాతలకు అక్కాచెల్లెమ్మలకు దివ్యాంగులకు వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వాలంటరీ ద్వారా పెన్షన్ ఇంటివద్దకు చేరవేస్తున్నారని వారి జీవితాలకు భరోసాగా నిలుస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేనివిధంగా ఆంధ్ర ప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దశలవారిగా అర్హులైన వారందరికి పెన్షన్లు అందించడం జరుగుతుందన్నారు. అక్కాచెల్లెమ్మల కష్టాలు చూసి వారి కన్నీళ్లను కష్టాలు తీరుస్తానని అనాడు మాట ఇచ్చిన ప్రకారం దశలవారిగా పెన్షన్ పెంచారన్నారు. రూ.2750 నుండి రూ.3 వేలకు పెంచినట్లు తెలిపారు. ఈబృహత్తరమైన కార్యక్రమం కేవలం అధికారం చేపట్టిన నాలుగున్నర సంవత ్సర కాలంలో చేయడం ఒకచారిత్రత్మమైన విషయమన్నారు. అలాగే నవరత్నాలు అమలుచేసి సంక్షేమ పథకాలు ప్రజలముంగిటకు చేరుస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు తెదేపా వారు వస్తారు. లేనిపోని వాగ్దానాలు చేస్తారు వారి మాటలు నమ్మవద్దని ముఖ్యంగా చంద్రబాబు అపద్దాల కోరు అని ఏద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మీబిడ్డ ఎమ్మెల్యేగా పోటీచేస్తున్నారని ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పున్నాశేషయ్య, పున్నా రాజేశ ్వరీ, బాషా, మాజీ కౌన్సిలరు సుబ్బరాయుడు, జాకీర్ ఉశేన్, పండు, లక్ష్మీనారాయణ, పడగండ్ల సుబ్రమణ్యం , సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన గరుడ ప్రసాద్

**బనగానపల్లె,జనవరి3,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు బనగానపల్లె పట్టణ ఎస్సీ కాలనీకి చెందిన పెయింటర్ గరుడ ప్రసాద్ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి గజమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా గరుడ ప్రసాద్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి,ఎమె ్మల్యే కాటసాని రామిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే తన ధ్యేయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బలక్ష్మమ్మ,మార్కెట్‌యార్డు చైర్మన్ గరుడ దీవెనమ్మ,వైసీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రవికుమార్‌రెడ్డి,వైసీపీ నాయకులు నారాయణ,గౌండా కంబగిరి,105బూత్ సభ్యులు మధు,సురేష్,చిన్న మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

**బనగానపల్లె,జనవరి3,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు వికలాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అందనం దేవరాజు నేతృత్వంలో బుధవారం ధర్నా నిర్వహించారు.ముందుగా పెట్రోల్ బంకు కూడలి నందు వికలాంగులు ఎమ్మార్పీఎస్,సీపీఐ,బీజేపీ,ప్రజా సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ వికలాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని,ఇంటి స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని,అలాగే బ్యాంకు రుణాలు,మూడు చక్రాల స్కూటర్లు ఇవ్వాలని,వికలాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి పలు డిమాండ్ల కూడిన వినతిపత్రాని ్న తహసీల్దార్‌కు అందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద మునయ్య మాదిగ,సీపీఐ నాయకులు రాముడు,ఆటో యూనియన్ నాయకులు దస్తగిరి,బీజేపీ నాయకులు జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

**వెల్దుర్తి, జనవరి3,ప్రభాతవార్త :** స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని గల డోన్ వైపున ఉన్న రైల్వే గేట్ల సమీపంలో బుధవారం రైలు ఢీకొన్న ప్రమాదంలో వెల్దుర్తి పట్టణానికి చెందిన కురువ రాముడు(52) మృతిచెందాడు.కర్నూలు రైల్వే ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు మధురై నుంచి ఓఖా వెళ్ళ సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రాముడును ఢీకొంది.రాముడికి మతిస్థిమిత ం సరిగా లేకపోవడంతో పాటు చెవుడు,పక్షవాతం ఉన్నట్లు తెలిసింది.అతను రైలు పట్టాలను దాట సమయంలో ఈ ప్రమాదం సంభవించిందని అతను అక్కడికక్కడే మరణించి పట్టాలపై విగతజీవిగా పడిపోయాడు.ఈ విషయం తెలుసుకున్న వెల్దుర్తి రైల్వేస్టేషన్ మాస్టర్ రామాంజనేయులు ద్వార సమాచారం తెలుసుకున్న కర్నూలు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సిహెచ్‌సికి తరలించారు.మృతునికి భార్య,ఇద్దరు దివ్యాంగులైన పిల్లలు సంతానం ఉన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించమంటే అరెస్టులా..?

:- ఐద్వా మండల అధ్యక్షులు శేఖున్‌బీ



**ఆలూరు,జనవరి 3,ప్రభాతవార్త :** గత 22రోజులుగా అంగన్‌వాడీ మహిళలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రోడ్లపై సమ్మె చేస్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఐద్వా మండల అధ్యక్షులు శేఖున్‌బీ అన్నారు. బుధవారం పట్టణంలోని జ్యోతిబసు భవనంలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద శాంతియుతంగా ధర్నాకు పిలుపునిచ్చి ఒదన్నారు. అంగన్‌వాడీ మహిళలు కర్నూలులో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ముట్టడి కార్యక్రమానికి వెళుతుంటే పోలీసులు అడ్డగించి అక్రమ అరెస్టులు చేయడం అమానుషమన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో తమ న్యాయమైన కోరికలను అడిగేందుకు వెళుతుంటే ఎక్కడికక్కడే అరెస్టులు చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ధర్నా,ఆందోళనలో పాల్గొనకుండ ముందస్తు నోటీసులు ఇవ్వడం,సిఐటియు నాయకులు,అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేయడం,నిర్బంధించడం సిగ్గుచేటన్నారు.

# సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయాలి



**నందికొట్కూరు,జనవరి 3,ప్రభాతవార్త:** మహిళల విద్యా హక్కు కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సాయిత్రిబాయి పూలే అని ఆమె ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వ రరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రాము,రత్నమ్మ, ఉశేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ఎనలేని కృషి



**హొళగుంద,జనవరి 3,ప్రభాతవార్త :** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిందని బహుజన టైమ్స్ ఎండి దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం హొళగుందలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం నజీర్ అహ్మద్ అధ్యక్షతన సావిత్రిభాయి పూలే 193వ జయంతిని బహుజన టైమ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం నజీర్ అహ్మద్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సావిత్రిభాయి పూలే ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం బహుజన ఎండి దుర్గా ప్రసాద్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను శాలువా,పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి జిల్లా అధ్యక్షులు ఎల్లార్తి అర్జున్,హైస్కూల్ చైర్మన్ జొండే సిద్దప్ప, వైస్ చైర్మన్ మంగన్న,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పూలేని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి



**కర్నూలు రూరల్,జనవరి 3,ప్రభాతవార్త :** సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలేని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. సావిత్రిభాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటరమణ కాలనీలో మొదటిలైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా లయన్స్‌క్లబ్ సభ్యులు సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ కళాశాల ఆన్‌లైన్ జాబ్ ట్రైనింగ్ విద్యార్థినీలు,లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షురాలు లయన్ రాయపాటి నాగలక్ష్మి,క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

# బహిరంగ మార్కెట్ ధరకే కందులు కొనుగోలు

**మద్దికెర,జనవరి 3,ప్రభాతవార్త :** మండలంలో కందిపంట సాగు చేసిన రైతులు బహిరంగ మార్కెట్ ధరకే ఆరోజు ఉన్న ధరకు కందులు కొనుగోలు చేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి రవి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ నాఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాల దగ్గర కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కందిపంట సాగు చేసిన రైతులు వారి యొక్క రైతుభరోసా కేంద్రాల్లో తమ పేరును నమోదు చేసుకుని వారి యొక్క పంటను ప్రభుత్వానికి అమ్మితే నగదు వారంరోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. కావున కందిపంట సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కందులు అమ్మేవారు ఆర్‌బికెలో రిజిస్టర్ చేసుకోవాలి

**దేవనకొండ,జనవరి 3,ప్రభాతవార్త :** కందులను అమ్మదలచుకున్న రైతులు రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారుగా 700హెక్టార్లలో కందిపంట వేయడం జరిగిందన్నారు. కందులను అమ్మాలనుకునే రైతులు మీ గ్రామంలోని నాఫెడ్ వారు ఆరోజు మార్కెట్‌లో ఉన్న ధరను నిర్ణయించడం జరుగుతుందన్నారు. సంచులు,ట్రాన్స్‌పోర్టేషన్ నాఫెడ్ వారే భాద్యత వహిస్తారన్నారు. కావున కందులు అమ్మేవారు ఆర్‌బికెల్లో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే రబీలో వేసిన పంటలను పంటనమోదు చేసుకోవాలన్నారు.

# విద్యార్థిని ఘనంగా సన్మానం చేసిన జెడ్పీపాఠశాల ప్రధానోపాధ్యాయులు



**పగిడ్యాల, జనవరి 3,ప్రభాతవార్త** స్థానిక జెడ్పీపాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థి చుక్కరాతి రమేష్ గౌడు 12మందికి అండర్ -17, కబడీ క్రీడాకారులకు రూ. 8,000 లు విలువచేసేక్రీడాదుస్తలు ఉచితంగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మధుసూధనరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మధుసూధనరావు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థి చుక్కరాతి రమేష్ గౌడు పాఠశాలపై అభిమానంతో కబడీ క్రీడాకారులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయుడన్నారు. పూర్వపు విద్యార్థి రమేష్ గౌడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మధుసూధనరావు దుశ్శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు రషీద్‌మియ్యా, సుదర్శనరెడ్డి, మోహన్ దాసు,కోచ్ శివ, క్రీడాశ్రీ తోకల పీతాంబరెడ్డి, చుక్కరాతి రమేష్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీటీఎఫ్ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె, జనవరి3,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అలాగే ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి మాట్లాడుతూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు ఎం.మధుసూదన్‌రావు,జిల్లా ఉపాధ్యక్షులు జి.లింగమయ్య,రాష్ట్ర కౌన్సిలర్లు వి.సుబ్బరాయుడు,పి.సుబ్బరాయుడు,బనగానపల్లె మండల అధ్యక్షులు వెంకటకృష్ణుడు,అవుకు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.ఓబులేసు,బేతంచెర్ల మండల అధ్యక్షులు మహబూబ్ బాషా,రాజు నాయక్,యాగంటప్ప,ఖాద్రీ,రమేష్,గోవిందనాయక్,పోలియ నాయక్,శేఖర్,వీరన్న,బాలాజీ నాయక్,రఫి,చాంద్ బాషా,రహిమాన్,ఎల్ల సుబ్బయ్య,రామస్వామి,శివయ్య పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలేకు ఘననివాళి



**బేతంచెర్ల,జనవరి3,ప్రభాతవార్త:** భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ప్రైవేట్,ప్రభుత్వ పాఠశాల,కళాశాలల్లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల,కళాశాలల నిర్వాహకులు మాట్లాడుతూ స్త్రీలకు విద్య వల్లే అన్ని రకాల ఆధునికత సాధ్యమవుతుందని భావించి నాడు కుల వ్యవస్థ,పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం పోరాడి బాలికల విద్యను అందించడంలో సావిత్రిబాయి పూలే అందించిన సేవలు అనిర్వచరనీయమైనవని కొనియాడారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

# సావిత్రిబాయిపూలే ఘననివాళులు



**బనగానపల్లె,జనవరి3,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.స్వర్ణ లతాదేవి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల అధ్యాపకురాలు జి.నీతమ్మ,డాక్టర్ కె.బడేసాహెబ్‌లు మాట్లాడుతూ భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయునిగా దేశంలో లక్షలాది మంది ప్రజలకు దారి చూపిందన్నారు. ఫాతిమా షేక్ సహకారంతో మహిళల కోసం మొదటి విద్యాలయాన్ని ఏర్పాటుచేసి మహిళలకు విద్యను దగ్గర చేశారన్నారు. అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి,ఉమామహేశ్వరరెడ్డి,రామకృష్ణ,నాగరాజారెడ్డి,వహీదా పాల్గొన్నారు.

# అండర్-17 క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక



**మంత్రాలయ ం,జనవరి 3,ప్రభాతవార్త:** మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగేష్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయినట్లు హెఎం హంపయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు గతఅక్టోబర్ 27వ తారీఖున కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్‌గేమ్ స్ క్రికెట్ అండర్-17 సెలక్షన్ స్‌లో తీవ్ర పోటీని ఎదుర్కొని 1200 మందిని దాటుకొని జిల్లా జట్టుకు ఎంపిక కావడం హర్ షించదగ్గ విషయమన్నారు. నాగేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 7,8,9వ తారీఖులలో గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనపరిచి ఉన్నతంగా రాణించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామన్న,చంద్రశేఖర్,నాగభూషణం,వీరేష్‌రావు,గోపాల్‌నాయక్,బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య శ్రీరాముని అంక్షితలు అందుకున్న ప్రజాప్రతినిధులు



**కర్నూలు విద్య, జనవరి 3, ప్రభాతవార్త:** అయోధ్య శ్రీరాముని అంక్షితలు కర్నూలు ఎంపీ డా.సంజీవ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కెడిసిసి బ్యాంకు అధ్యక్షురాలు ఎస్‌వి విజయమనోహరి, టిడిపి అసెంబ్లీ కన్వీనర్ టీజి భరత్, డివిఆర్ హోటల్ అధినేత డి వెంకటేశ్వర్లులు అందుకున్నారు. ఈ అక్షింతలు శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నందిసాయిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రాణేష్, రాష్ట్ర ధర్మ ప్రసార ఎవి ప్రసాద్, కర్నూలు విభాగ్‌సేవ ప్రముఖ గురుమూర్తి, నగర కార్యదర్శి ఈపూరి నాగరాజులు అధ్వర్యంలో అందించడం జరిగిందన్నారు.

# చీకట్లను తరిమిన దివ్వె సావిత్రీబాయి పూలే..

:-ఘనంగా సావిత్రీబాయి పూలే 193వ జయంతి వేడుకలు..



**కోసిగి, జనవరి 3, ప్రభాతవార్త :** దేశంలో చీకట్లు నిండుకుని చదువులేక అందరూ చీకట్లలోనే మగ్గే సమయంలో ఒక వెలుగు దివ్వెగా తారాస్థాయిలో మణిమకుటంగా సావిత్రీబాయి పూలే నిలిచిందని కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం ఖలీల్ అహ్మద్ అన్నారు..బుధవారం చదువుల తల్లి సావిత్రిబాయి జ్యోతిరావ్‌పూలే 193వ జయంతి వేడుకలను కోసిగి బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని పల్లెపాడు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి విద్యార్థుల చేత పూలమాలలు వేయించి ఉపాధ్యాయులు నివాళ్లలర్పించారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయుని బృందం తదితరులు పాల్గొన్నారు..

**పల్లెపాడులో:** భారత దేశంలో పుట్టిన ప్రతి బాలిక చదువుకోవాలని మహిళా అక్షరాస్యతకు బాటలు వేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అడుగు జాడల్లో నడవాలని పల్లెపాడు హైస్కూల్ మహిళా ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి అన్నారు.. సావిత్రీబాయి జయంతి వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.మీనాక్షి , మానస, పద్మ, యశోద, హసీన, సంధ్య, తదితరులు పాల్గొన్నారు..

# మహిళల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు అందించిన సావిత్రిబాయి పూలే



**కొలిమిగుండ్ల,జనవరి3,ప్రభాతవార్త:** మహిళల అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే ఎనలేని సేవలు అందించిందని మండల విద్యాధికారి అబ్దుల్ కలాం,ఎంపిడివో సాయికృష్ణలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొలిమిగుండ్లలోని ఎంఈవో కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను యూటీఎఫ్ మండల అధ్యక్షులు సుంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మద్దిలేటి,కమలమ్మ,సిబ్బంది పాల్గొన్నారు.

**కనకాద్రిపల్లెలో :** మండలంలోని కనకాద్రిపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండలంలోని సీనియర్ మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు హరి,గురులక్ష్మి,వి.వి.నాయక్,మాధవీలత,సన్మానగ్రహీతలు అరుణ,సుమిత్ర,శ్రీదేవి,సునీత,శశికళ,వివిధ గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు,తెలుగుపండితులు వై.వి.ఎస్.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు మాయ మాటలను నమ్మొద్దండి

– ఆశావాహులంతా ఇంటికే .. తెరపైకి నేనే...!– ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



**గూడూరు,జనవరి 3, ప్రభాతవార్త :** వైకాపా పాలనపై ప్రతిపక్ష నేత టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దండని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక పాతబస్టాండు ఆవరణంలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఫించన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాలించిన ముఖ్యమంత్రుల పాలనలో రెండు రూపాయలకు కిలో బియ్యం అంటే దివంగత ఎన్.టి.రామారావు, ఆరోగ్య శ్రీ అంటే వై.ఎస్ రాజశేఖరరెడ్డిల పాలనలు గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో చెప్పుకోవడానికి ఏ ఒక్కటీ లేదన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చిన ప్రజలకు వాటిలో ఏ ఒక్కటి పరిష్కరించలేక పోయ్యారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన నవరత్నాలంటీనీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించిన ఘనత ఒక్క జగనన్నకే సాధ్యమైందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వచ్చి టిక్కెట్ కోసం ప్రయత్నం చేసే వారు కొందరుంటే ..., తనపై అనవసరపు ప్రచారాలు చేస్తూ వచ్చే ఎన్నికల్లో తనకు చాన్స్ ఉండదని మరి కొందరంటుంటే.. వీరి మాదిరిగానే ఆశావాహులు చేసే కాకమ్మ కథలను ఎవరు వింటారని స్పష్టం చేశారు. తనపై చేసే తప్పుడు ప్రచారాలు ఎన్ని చేసినా .., అదే పనిగా తనపై అక్కసుతో మోసుకుపోయి లేని పోని వాటి గురించి ఎన్నీ చెప్పినా... జగనన్న నమ్మదని, జగనన్న ఆశీస్సులు తనకే ఉన్నాయని, ఆ నమ్మకంతోనే వచ్చే ఎన్నికల్లో మళ్లీ కోడుమూరు అసెంబ్లీ స్థానంకు వైకాపా అభ్యర్థిగా నేనే పోటీలో ఉంటానని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు,వైఎస్ చైర్మన్లు అస్లాం,లక్ష్మన్న,కౌన్సిలర్లు నందకిశోర్, టీచర్‌కిశోర్,మద్దిలేటి,బజారి,పట్టణ వైకాపా కన్వీనర్ ఆబేలు,జిల్లా సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు,జిల్లా వక్ఫుబోర్డు డైరెక్టర్ జిలాని,కోఆప్షన్ మదార్‌భాష,మునగాల సర్పంచ్ రామాంజినేయలు,కోఆపరెటివ్ డైరెక్టర్లు పత్తిరంగడు,సత్యాలు,వైకాపా నాయకులు చికెన్ వలీ,మహేశ్వరరెడ్డి,దండుశ్రీను,హబీ,నాసీర్‌భాష,ప్రభాకర్,మూలగేరి రంగడు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకి గజమాలతో సత్కారం : కొత్త సంవత్సరంలో పెరిగిన ఫించన్ల పంపిణీకి వచ్చిన కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను స్థానిక వైకాపా నాయకులు,ఫించన్ల దారులు గజమాల వేసి ఘనంగా సత్కరించారు.

# ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



**వెలుగోడు,జనవరి 3,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యా వనరుల కేంద్రంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆపాస్ వెలుగోడు మండల శాఖ అధ్యక్షులు ఎస్.నాగసుబ్బనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరయిన ఏపియుఎస్ రాష్ట్ర సహా కోశాధికారి ఏ.కృష్ణార్జురెడ్డి మాట్లాడుతు సావిత్రిబాయి పూలే జీవితం యావత్ భారతీకులందరికి ఆదర్శప్రాయమని, మహిళలల విద్యాభివృద్ధికి ఆమె విశేషంగా కృషిచేశారని,సమాజంలోని మూడనమ్మకాలను అంతమొందించేందుకు ఉద్యమించారన్నారు. అనంతరం ఎపియుఎస్ సంఘం శాఖ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయినీయులైన శ్రీమతిహజరబి, శ్రీమతి నాగలింగేశ్వరమ్మ, శ్రీమతి విశాలక్ష్మి, శ్రీమతి భాగ్యమ్మ,శ్రీమతి ఆదిలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా మీడియా కార్యదర్శి సురేష్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా..గ్రామ దేవతమ్మా.. గ్రామాన్ని చల్లంగా చూడవమ్మా..



**కందుకూరు/అగసనూరు(కోసిగి), జనవరి 3, ప్రభాతవార్త :** కోసిగి మండల పరిధిలోని కందుకూరు, అగసనూరు గ్రామాలల్లో గ్రామస్థులు మూకుమ్మడిగా జరుపుకుంటున్న ఊరు దేవత శ్రీ మారికాంబదేవి దేవరను గ్రామ ప్రజలు అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. "అమ్మా..అమ్మా. .మాయమ్మా మమ్మును చల్లంగా చూడవమ్మా" అంటూ మారికాంబ దేవతకు జేజేలు పలుకుతూ భక్తులు జంతువులను బలి ఇచ్చి తమ మొక్కులను తీర్చుకుని సంబరాలు చేసుకున్నారు. కందుకూరు గ్రామ సర్పంచ్ హనుమంది అధ్యక్షతన, అగసనూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉలిగయ్యల అధ్యక్షతన దేవర కార్యక్రమాన్ని నిర్వహించారు.. ముఖ్యంగా ప్రతి ఇంటి నుండి ఒక కుంభంను తీసుకెళ్లి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి భక్తి శ్రద్దలతో పూజలను నిర్వహించారు. ఇక మహిళలు కలశాలతో, ప్రమీదలు ఏర్పాటు చేసుకుని అమ్మవారికి హారతులను అందించారు. గ్రామంలో కుంభమేళను నిర్వహించి ప్రతి మహిళ తమ తలపై కుంభాలను(కాగులను) తీసుకెళ్లి అమ్మవారికి అర్పించడం విశేషం.. గ్రామాన్ని కాపాడాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, కరువు కాటకాలు కలుగకుండ గ్రామానికి ఏలాంటి అరిష్టం జరుగకుండా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఈ మారికాంబదేవి దేవర పూజలకు వైయస్సార్‌సీపీ మండల ఇంచార్జీ మురళీమోహన్‌రెడ్డి ఆయా గ్రామాల్లోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆయా గ్రామాలు బంధువులతో, భక్తులతో కిక్కిరిసి పోయింది.. ఎక్కడ చూసినా జనమేజనం..అందరి ఇళ్లల్లో పండగ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు..గ్రామంలో జనసంచారం చోటు చేసుకుంది..ఈ సందర్భంగా దేవరకు హాజరైన మురళీమోహన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులకు గ్రామస్తులు సన్మానం చేసారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లవకుశ ఈరన్న, అర్లబండ సొసైటి అధ్యక్షులు నాడిగేని నరసింహులు, నాడిగేని నాగరాజు, మాజీ సర్పంచ్ ఆకాశరెడ్డి, టీకే.భీమయ్య, కందుకూరు తాయన్న, రమేష్, కురువ మల్లయ్య, బీంరెడ్డి, దేవేంద్ర, శివరామ్, డీలర్ దేవేంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు..

# మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిక



**పగిడ్యాల,జనవరి 3,ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వైకాపా నాయకులు నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో బుధవారం అల్లూరులో తెలుగుదేశం పార్టీలో చేశారు. మాండ్ర శివానందరెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా వేసి అందరిని అహ్వానించారు. వైకాపా పార్టీ 13వవార్డు సభ్యులు మంగలి శేఖర్, 13వ వార్డు బిజెపి నాయకులు శివరాముడు, వైకాపా నాయకులు గోవిందు, లోకేష్, లింగస్వామి, గోపాల్, మద్దిలేటి, నరసింహా, రవికుమార్, స్వామి, పక్కిర్‌సాహెబ్, సాంబశివుడు, రంగస్వామి, బాలీశ్వర్, కుమ్మరి శేఖర్,శ్రీను, చాకలి, రాముడు, రామస్వామి, వెంకటేశ్వర్లు, రాజేష్, మోహన్‌నాయుడు, చంద్రశేఖర్, తిప్పారాజుల, మధు నంద్యాల పార్లమెంటు టిడిపి ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరడంతో వారికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారందరికీ అండగావుంటామనీ తమ సహాయ సహకారాలు అందిస్తామనీ నంద్యాల పార్లమెంటు టిడిపి ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డిబరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామస్వామి, శివ, నాగరాజు, పాలమర్రి నాగరాజు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న మాట చెప్పారంటే..చేస్తారంతే..!

**తుగ్గలి,జనవరి 3,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఏదైనా మాట చెప్పారంటే అది చేసి చూపిస్తారని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి లోని పగిడిరాయి గ్రామంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు ఆ గ్రామసర్పంచ్ సౌజన్య,ఎంపిపి ఆదెమ్మ,సర్పంచ్ గౌరవ సలహాదారుడు హనుమంతు,మాజీ జడ్‌పిటిసి సభ్యుడు జగన్నాథ్‌రెడ్డి,ఎంపిపి భర్త రంగన్నలు గజమాలతో సన్మానించి డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా కాలుస్తూ పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే పగిడిరాయి గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ సౌజన్య,తిమ్మప్ప,సర్పంచ్ గౌరవ సలహాదారుడు హనుమంతుల నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వైఎస్సార్ పెన్షన్ కానుకకు హాజరై వృద్దులు,వితంతువులు వివిధ రకాల చేతి వృత్తిదారులకు పెంచిన ఫించన్లను, నూతన పించన్లను అందచేశారు. అలాగే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ లక్షలాదిమంది అవ్వతాతల కళ్లల్లో ఒత్తులు వేసుకుని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న పెన్షన్ రోజు రానే వచ్చిందన్నారు. వారి ఆశలు నెరవేర్చేందుకు నూతన సంవత్సర కానుక అందించేందుకు సిఎం జగన్ నాడు ప్రతిపక్షనేతగా ఉన్న దినాల్లో క్రమంగా పించన్లను పెంచుతూ రూ.3వేలు చేస్తానని నాడు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పించన్ కానుక ఒక బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నాడు ఉమ్మడి ఏపిలో ముఖ్యమంత్రిగా స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు మరోన్నో అభివృద్ది కార్యక్రమాలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా దేవుడయ్యాడని కొనియాడారు. తండ్రికి తగ్గ తనయుడుగా పేద ప్రజలకు ఇచ్చిన మాటను తూ.చ తప్పకుండ నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. ఒక్క జగనన్నను ఢీకొనేందుకు దమ్ము,ధైర్యం లేక రాబోయే ఎన్నికల్లో అనేక పార్టీలు మూకుమ్మడిగా కలిసి కుమ్మక్కై పొత్తులతో వస్తున్నాయని వారిని ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పులికొండనాయక్,సచివాలయ మండల కన్వినర్ హనుమంతు,మండల కన్వినర్ జిట్టా నాగేష్,తుగ్గలి మోహన్‌రెడ్డి,శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి ఎర్రనాగప్ప,నాగభూషణం రెడ్డి,రామకొండ సుధాకర్‌రెడ్డి,బసిరెడ్డి, అట్ల గోపాల్‌రెడ్డి,బొందిమడుగుల ఈశ్వర్‌రెడ్డి,గిరిగెట్ల విష్ణువర్ధన్‌రెడ్డి,రంగనాథ్ రెడ్డి,శభాష్‌పురం రవి,రాఘవరెడ్డి,గుంత రఘు,సోమశేఖర్‌రెడ్డి,గంగాధర్, ఓబులేషు,లింగన్న,మద్దిలేటి,సుధాకర్‌రెడ్డిలతో పాటు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల అక్రమ అరెస్టులు దుర్మార్గం



**ఆస్పరి,జనవరి 3,ప్రభాతవార్త :** గత 22రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్‌కు వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను బుధవారం తెల్లవారు జామున 4గంటల నుంచి అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని సిఐటియు నాయకులు పి హనుమంతు,ఎస్‌ఎఫ్ఐ నాయకులు రవిలు అన్నారు. ఆలూరు,ఆస్పరి ప్రాజెక్టు పరిధిలో అనేక మంది అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు బస్ ఆపి దించేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి వారిని అక్రమ అరెస్టులు చేయడం చూస్తే ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందన్నారు. పోలీసులు సిఐటియు నాయకులకు మీరు కర్నూలుకి వెళ్లవద్దని ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదన్నారు. అరెస్టు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు,పోలీసులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే వైసిపి పార్టీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి,ఆలూరు అంగన్‌వాడీ కార్యకర్తలు విశ్వకుమారి, నాగమణి,లేపాక్షి,మస్తాన్‌బీ,రాధమ్మ,ప్రభావతి తదితరులున్నారు.

# చేతివృత్తులపై శిక్షణ

**కర్నూలు రూరల్,జనవరి 3,ప్రభాతవార్త :** రాజ్‌కుమార్ ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఆయా రకాల చేతి వృత్తులపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు రత్నకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటిసమాజంలో ఆయా రకాల సమస్యల వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారికి స్వయం ఉపాధి అవకాశాలు అందిస్తున్నామన్నారు. మహిళలకు బ్యూటీషన్,కంప్యూటర్,మగ్గంవర్క్,కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా ఆసక్తి ఉన్న మహిళలు,యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7569325654ను సంప్రదించాలన్నారు.

# 23వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె



**ఆదోనిలీగల్, జనవరి03, ప్రభాతవార్త;** గత 22 రోజుల నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, సరోజ, జానకి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. నిత్యవసర ధరలు ఆకాశానికి పెరిగిన సందర్భంలో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని, అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు రూ.5 లక్షలు గ్రాట్యుటీని అమలు చేయాలని, అంగన్‌వాడీలు సర్వీసులో ఉండి చనిపోయే కారుణ్య నియామకాల ప్రకారం వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, సీఐటీయూ నాయకులు మహానందరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న, రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు వీరేష , విజయ్, కాంగ్రెస్ నాయకులు లోకేష్, అంగన్‌వాడీ నాయకురాళ్లు రేణుక, పద్మ, మీనాకుమారి, సోమక్క, సరోజ, గీత, వీరమ్మ, రిజ్వానా, శారద, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేవనూరు గ్రామ వైసీపీ నాయకులు మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిక



**మిడుతూరు, జనవరి03, ప్రభాతవార్త;** మండలంలోని దేవనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో కన్వీనర్ రమేష్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుండం రమణారెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు నాగేంద్రుడు ఆధ్వర్యంలో దేవనూరుకు చెందిన వైకాపా నాయకులు, మాజీ సర్పంచ్ నాగేంద్రుడు, యాకుబ్‌బాషా, వలీద్దిన్, షమీవుల్లా, రాషద్‌బాషా, నాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, అల్తాఫ్ ఆలీ, అన్వర్‌బాషా, తహీర్ ఆలీ, నాగేంద్రుడు, షేక్షావలి, మదన్‌గోపాల్, సలీం, శివశంకర్ నాయుడు, జాకీర్ ఆలీ, అఫ్రోస్‌ఖాన్, అబ్దుల్‌గని, వేణుగోపాల్, రాషద్‌అహ్మద్ తదితరులు భారీ సంఖ్యలో చేరారు. మొత్తం వంద కుటుంబాలు టీడీపీలో చేరినట్లు చెప్పారు. టీడీపీ పార్టీ సిద్ధాంతాలు మెచ్చి పార్టీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహిద్దీన్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరికాభ్యున్నతికి ప్రభుత్వం చేదోడు



**నంద్యాల, జనవరి 03, ప్రభాతవార్త:** పేద ప్రజల ఆర్థికాభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ చేదోడుగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమున్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుండి కాకినాడ నుండి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ ఛైర్మెన్ పీపీ.నాగిరెడ్డి, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృత్‌రాజ్, ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కింద 2,24,238మందికి రూ.66.64కోట్లు లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఈఏడాది జనవరి నుండి పెంచిన పెన్షన్ రూ.3వేలు పెన్షన్ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈఏడాది జనవరి నుండి కొత్తగా 3,171మంది పెన్షన్‌దారులకు రూ.95.13లక్షలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేషన్ డైరెక్టర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పాడు అందిస్తుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సర్వీసులను ప్రజల ముంగిటికి తీసుకెళుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం పెన్షనుదారులకు చెక్‌ను అందజేశారు.

## కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**– డీసీసీ అధ్యక్షులు లక్ష్మినరసింహా యాదవ్**



**బేతంచెర్ల, జనవరి3, ప్రభాతవార్త:** రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇచ్చి అభివృద్ధి చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని నంద్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జె.లక్ష్మినరసింహ యాదవ్ అన్నారు. ఇంటింటికి కాంగ్రెస్ పేరుతో బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో డోన్ నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటిస్వామితో కలిసి కాంగ్రెస్ చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంతోపాటు రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగించడం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పకడ్బందీగా అమలు చేయడం, నంద్యాల పార్లమెంట్‌లో ఉన్న సిద్దేశ్వరం అలుగు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి బీసీ కులగణన చేపడతామన్నారు. నంద్యాల పార్లమెంట్‌లోని ప్రతి నియోజకవర్గంలో రైతు బజార్లను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో కూడా 108,104, ఆరోగ్యశ్రీ, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని వారన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.3లక్షల రుణమాఫీ, పంటకు మద్దతు ధర ప్రకటిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పై మొదటి సంతకం ఉంటుందన్నారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామన్నారు. దేశాన్ని ముక్కలుచెక్కలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని అబద్దపు వాగ్దానాలతో నీతిమాలిన కబుర్లతో గద్దెనెక్కి రాజ్యాంగ విలువలను, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను నాశనం చేస్తున్న బీజేపీకి నిత్యవసర సరుకుల ధరలను పెంచుతున్న రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ఆయన కోరారు. వారితోపాటు పీసీసీ డెలిగేట్ యు.జనార్ధన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సునీత, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.3.62 కోట్లతో 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్-ఎమ్మెల్యే శిల్పా



**నంద్యాల క్రైం, జనవరి 3, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణం ప్రథమనందీశ్వర దేవస్థాన సమీపంలో బుధవారం రూ.3.62 కోట్ల వ్యయంతో నూతన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణ జనాభా పెరుగుతున్న దృష్ట్యా విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సేవలను అందించడం కోసమే ప్రారంభించామన్నారు. ఈసబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల పట్టణంలోని పలువార్డుల్లో నాణ్యమైన విద్యుత్‌సేవలు అందించుకోవచ్చున్నారు. విద్యుత్ సమస్యలు వివిధ వార్డుల్లో ఉన్నవాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ఎలక్ట్రిసిటి ఎస్ఈ, ఈఈ రమణారెడ్డి, ఎఇలు, జెఈలు రామయ్య, విద్యుత్‌శాఖ సిబ్బంది వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్ పాంషావలి, ఏపీఎస్పీడిసిఎల్ డా.శశికళారెడ్డి, దృశ్యకళల డైరెక్టురు సునీత అమృతరాజ్, కౌన్సిలర్ షెక్ సంజిద, జాకీర్, సోమశేఖర్‌రెడ్డి, అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈసీ మార్గదర్శకాలతో ఓటర్ల జాబితా సవరణ - కలెక్టర్ డా.సృజన



**కర్నూలు, జనవరి 03, ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించే ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల తో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కు సంబంధించి ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే నిర్దేశించిన ఫారం లో దరఖాస్తు చేసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.... సవరణలు కోరుతూ ఎక్కువ సంఖ్యలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి కర్నూలు మూడవ స్థానంలో ఉందని , నెల్లూరు, విశాఖపట్నం జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు.. వచ్చిన ప్రతి ఫారం ను ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం డిస్పోస్ చేస్తామని తెలియజేశారు. ఫోటోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, వికలాంగ ఓటర్ల మార్కింగ్, జెండర్ రేషియో , ఈపీ రేషియో తదితర అంశాలను వెరిఫై చేస్తున్నామని, ఇవన్నీ త్వరలో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలియజేశారు. ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్ కు రాలేని పరిస్థితిలో ఉన్న 80 సంవత్సరాలు పై బడిన వృద్ధుల, 60 శాతం పైన శారీరక వికలాంగత్వం ఉన్న వారికి ఇంటి వద్దే ఓటు హక్కు కల్పించేందుకు ఏర్పాట్లు కల్పిస్తున్నామని , ఇంటి దగ్గరే ఓటు వేస్తామని ఒకసారి అప్లై చేసుకున్న తర్వాత తిరిగి పోలింగ్ స్టేషన్ కు వచ్చి ఓటు వేసే అవకాశం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత ఈ ఆర్వో కు తెలియచేయాలని కలెక్టర్ సూచించారు.. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు , ఎన్నికల సెల్ సూపరిండెంట్ మురళి , తెలుగుదేశం పార్టీ తరఫున ఎల్.వి. ప్రసాద్ , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కర్నాటి పుల్లారెడ్డి , ఏజాజ్ అలీ ఖాన్ , బిజెపి పార్టీ తరఫున సాయి ప్రదీప్ , బహుజన్ సమాజ్ పార్టీ తరఫున అరుణ్ కుమార్ , సాదిక్ అలీ పాల్గొన్నారు.

## బొజ్జా అరెస్టును రాజకీయం చేయడం తగదు



**నంద్యాల, జనవరి 3, ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టును ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేయడం తగదని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. వైసీపీ పార్టీ నేతలు జైలుపాలు చేస్తున్నారని రాజకీయ బురదజల్లే ప్రతిపక్ష నాయకుల అరోపణల్లో వాస్తవాలు లేవని ఎమ్మెల్యే అన్నారు. బొజ్జా అరెస్టుపై రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యాలపై ఎమ్మెల్యే బుధవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి సమితి బొజ్జా దశరథరామిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచడం జరిగిందన్నారు. 2016న మే 31న రాయలసీమ సాగునీటి సమితి అధ్వర్యంలో అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి రైతులు సంగమేశ్వరం సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తు ప్రజా శంఖుస్థాపన కోసం పిలుపునిచ్చిన నేపథ్యంలో బొజ్జా దశరథరామిరెడ్డిని రైతు నాయకులపై నాటి టిడిపి ప్రభుత్వంలో పోలీసులు కేసు పెట్టడం జరిగిందన్నారు. అనాడు టిడిపి ప్రభుత్వంలో పెట్టిన కేసులపై అరెస్టుచేయడం జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వంలో పెట్టిన కేసులకు సంబంధించి నేడు దశరథరామిరెడ్డిని రైతు నాయకులను అరెస్టుచేస్తే అది వైసీపీ ప్రభుత్వం, వైసీపీ నాయకులపై అనవసరంగా కక్షపూరితంగా కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు తమపార్టీపై నాయకులపై బురదజల్లే రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి స్వయంగా బొజ్జా దశరథరామిరెడ్డితో మాట్లాడడం జరిగిందని కేసులకు, అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలు, వాస్తవాలు తెలుసుకున్నామన్నారు. నాడు చేపట్టిన రాయలసీమ సాగునీటి ఉద్యమంలో పార్టీలకతీతంగా వైసీపీ నాయకులు కూడ పాల్గొన్నారని గ్రహించాలన్నారు. రైతుల పక్షాన నిలిచిన వైసీపీ ప్రభుత్వం అని ప్రతిరైతు మేలుకోరే ప్రభుత్వమని తెలిపారు. ఎన్నికలు వస్తున్నాయని రాజకీయాలు చేయడం మానుకోవాలని ప్రతిపక్ష నాయకులకు హితువు పలికారు. బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టు వైసీపీ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.

## అటవీ భూముల ఆక్రమణలపై జాయింట్ సర్వే

**ఈ నెల లోపు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి – జేసీ ఎన్.మౌర్య**

**కర్నూలు, జనవరి 03, ప్రభాతవార్త :** అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి పెండింగ్లో ఉన్న జాయింట్ సర్వే ఈ నెల లోపు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత డివిజనల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి పెండింగ్లో ఉన్న జాయింట్ సర్వేను, మండల సర్వేయర్లతో ఈ నెలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డివిజనల్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు... అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు వీలుగా అటవీ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.. రీ సర్వే నిర్వహించే సమయంలో అటవీ శాఖ భూముల హద్దులు గుర్తించేందుకు వీలుగా అటవీ శాఖ అధికారులు కూడా పాల్గొనే విధంగా వారికి ముందస్తు సమాచారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత డివిజనల్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.. హోలగుంద మండలంలోని ముద్దటమాగి, వెల్దుర్తి మండలంలోని బోగోలు గ్రామాలకు సంబంధించి కంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల వివరాలు నివేదిక రూపంలో వారంలోపు పంపించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత డివిజనల్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.. కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, డీఎఫ్ఓ శివశంకర్ రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## రాష్ట్ర భవిష్యత్తు కోసం బాబు మళ్లీ రావాలి - మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



**చాగలమర్రి, జనవరి3, ప్రభాతవార్త:** రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మద్దురు, ఆవులపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న ఆరు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రౌడీలు, గుండాలు రాజ్యమేలుతున్నరన్నారు. ప్రశ్నించేవారి పై తప్పుడు కేసులు నమోదుచేస్తూ నాయకులను, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నరన్నారు. ఇటీవల తాను భవిష్యత్తు కార్యక్రమానికి ఓ గ్రామానికి వెలుతుండగా స్థానిక నాయకులు గుండాల మాదిరిగా పోలీసులను అడ్డుపెట్టి తనను అడ్డుకోవడం జరిగిందన్నారు. ప్రతిపక్షాలు కార్యక్రమాలు చేస్తున్నప్పుడు గతంలో ఈ మాదిరిగా ఎప్పుడు జరగలేదన్నారు. అధికారంలో ఉన్నవారు ఎప్పుడు ఇలాంటి నీచరాజకీయాలు చేయలేదన్నారు. భూమా శోభానాగిరెడ్డి, భూమా నాగిరెడ్డిలు తాలుకాను ఎంత అభివృద్ధి చేసింది ప్రజలకు తెలుసునన్నారు. ఇప్పుడు తాను కూడా ప్రజా సమస్యలు, ప్రజల కోసం నిలబడి పోరాడుతామన్నారు. తల్లిదండ్రులను ఆదరించినట్లే తనను కూడా ఆశీర్వదిస్తే తాలుకాను మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈనెల 9వ తేది ఆళ్లగడ్డలో జరగబోయే నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రతిఒక్కరు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మిఓబుళమ్మ, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, గ్రామ టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ఓబయ్య, ఆంజనేయులు, అంజి, మహబూబ్ వలి, వీరయ్య, వెంకటసుబ్బయ్య, చాంద్‌బాషా, ఏసేబు, సువార్త, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్‌బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నంద్యాల జిల్లా స్పోక్‌పర్సన్ సల్ల నాగరాజు, జిల్లా మైనార్టీ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, జెట్టి నాగరాజు, ముల్లా మౌలాలి, ముల్లా అనిఫ్, గఫార్, అజీమ్, షబూల్, నూర్‌బాషా, ఖలీల్, బషీర్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రాంమోహన్, బాబయ్య, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం -ఎమ్మెల్యే



**కొత్తపల్లి, జనవరి 3, ప్రబాతవార్త:** రాష్ట్రా అభివృద్ధి ముఖ్య మంత్రి వై.యస్.జగన్‌మోహాన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పి.డి.ఓ. మేరీ అధ్యక్షతన జరిగిన పెన్స్‌న్ల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు అప్పటి ప్రతిపక్ష నాయకుడు ప్రస్తుత సి.యం. జగన్మోహాన్‌రెడ్డి పాదయాత్రలో అవ్వ, తాతలకు ఇచ్చిన ఎన్స్‌న్ పెంపు కార్యక్రమం తూచ తప్పకుండా పెంచుతు రూ.3వేలు చేశారని, దేశంలోని అన్ని రాష్ట్రాలు మన సి.యం.చేస్తున్న అభివృద్ధి వైపు చూస్తున్నాయని, రైతుల కోసం అనేక సంక్షేమ పతకాలు ఇవ్వడం జరిగిందని, రాష్ట్ర ప్రజలు మరోసారి జగనన్నకు అండగా నిలవాలని తెలిపారు. అనంతరం ఆయన ఆడుదాం-ఆంధ్ర క్రీడలకు సంభంధించిన కిట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి.కుసుమలత, జడ్పీటిసి సుధాకర్‌రెడ్డి, తహాసిల్దార్ పపెద్దన్న, ఏరియా కో-ఆర్డినేటర్ పుల్లయ్య, సర్పంచులు శోభలత, చంద్రశేఖర్ యాదవ్, విజయ్‌కుమార్, మారెన్న, ఎం.పి.టి.సి.స్రవంతి, వైకాపా మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీరు 2024లో అశీర్వదిస్తే అంతా మీకు మంచే జరుగుతుంది-బిసి



**గుల్లదుర్తి(కోవెలకుంట్ల), జనవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రెండు నెలల్లో ఎన్నికలు జరుగుతున్నందుకు ఈ 2024 ఎన్నికల్లో తెలుగు దేశం పార్టిని అవీర్వదిస్తే మీకు అంతా మంచి జరుగుతుందని మాజీ యంయల్ఎ బిసి జనార్ధనరెడ్డి అన్నారు. బాబు ష్యూర్టి గ్యారెంటీ కార్యక్రమంలో బాగంగా బుదవారము కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తి గ్రామంలో అయన కార్యక్రమము నిర్వహించారు. ఈసందర్భముగా గ్రామంలో శ్రీనివాసరెడ్డి సుదర్శణరెడ్డి, బాస్కరరెడ్డి గోవిందరరెడ్డి, నేతృత్వంలో బారీ స్వాగతము పలికారు. గ్రామ వెలుపల ఉన్న అర్‌అండ్‌బి రోడ్డు మీద నుండి అయనను, పూలపాన్పుపై నడిపించుకుంటు తీసుకుని వెల్లారు అక్కడ మహిళలు కూడా బిసికి స్వాగతము పలికారు. అనంతరము అయిన ఇంటింటికి తిరుగుతూ 2024 కురుక్షేత్రమనే ఎన్నికల్లో మీరందరు తెలుగు దేశం పార్టిని అశీర్వదిస్తే రాబోవు కాలంమంతా మీకు తెలుగు దేశం పార్టి మంచి చేస్తుందని చెప్పారు. మేము అదికాములోకి వస్తే మహిళలందరు అర్టిసి.బస్సుల్లో ఉచితంగా ప్రయాణము చేయవచ్చని చెప్పారు. అలాగే మూడు సిలెండర్లు కూడా ఉచితంగా అందిస్తామని చెప్పారు 18సంవత్సరిగలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ 1500అందించడము జరుగు తుందన్నారు. లాగే అమ్మకు వందనము పేరులో ఇంట్లో ఎంత మంది ఉంటే అ ంత మంది పిల్లలకు వారి తల్లుల ఖాతాలో బ్యాంకు రూ 15000 అందించడము జరుగుతుందని చెప్పారు., రైతులు ఏటా రూ 20000ఇస్తామని చెప్పారు. నిరుద్యోలకు ఉద్యోగము వచ్చే వరకు నెలలకు రూ 3000అందించడము జరుగుతుందని చెప్పారు. అందుకే మీరందరు తెలుగు దేశం పార్టిని అశీర్వదించాలని కోరారు.

## ఏపీలో ఫిబ్రవరి 2న ఎలక్షన్ కోడ్ -మార్చి 6న ఎన్నికలు

**నంద్యాల, జనవరి 3, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. 2024 ఫిబ్రవరి 2న ఎన్నికల కోడ్ ప్రకటించే అవకాశం ఉంది. మార్చి 6న ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార వేగాన్ని పెంచాయి. ఏపీలో విమర్శలు, ప్రతివిమర్శల మధ్య ఎన్నికల సంఘం నూతన ఓటర్ల లిస్టును తయారుచేసి తమ కార్యక్రమాలు ముమ్మరం చేసింది. ఒకవైపు ఈవిఎంల మీద అవగాహన కల్పిస్తు మరోవైపు ఓట్ల లెకింపు ప్రక్రియ మొదలుపెట్టింది. తాజాగా ఏపీలో ఓటర్ల సంఖ్యని ఎన్నికల సంఘం రిలీజ్ చేసింది. ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం ఏపీలో సుమారు 3,69,33,091 మంది ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో పురుషుల ఓటర్లు 1,83,24,588 మంది ఉండగా, మహిళలు 1,86,04,742 మంది ఉన్నారని తెలుస్తోంది. ఇక థర్డ్ జండర్ ఓటర్లు 3,761 మంది ఉన్నారని ఎన్నికల సంఘం లెక్కల్లో పేర్కొంది. రాష్ట్రంలో అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్లు ఉండగా, అత్యల్పంగా నర్సాపురం నియోజకవర్గంలో ఉన్నారని ఎన్నికల సంఘం నిర్ధారించింది.

## ఏపి ఎన్జీఓ హోమ్ స్థలంలో ఎలా సొంత పార్టీ కార్యాలయం నిర్మిస్తారు..!

**ఆదోని, జనవరి 3, ప్రభాతవార్త**

పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ నందు ఏపి ఎన్జీఓ స్థలంలో ఎలా సొంత పార్టీ కార్యాలయం నిర్మిస్తారని, స్థలం ఇవ్వడానికి వారెవరు..ఆ స్థలంలో వైకాపా పార్టీ కార్యాలయం నిర్మించడానికి మీరెవరు..అంటూ ఆదోని శాసనసభ్యులుపై, ఏపి ఎన్జీఓ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ వెంగల్‌రెడ్డిలపై తెదేపా నాయకులు ఉమ్మి సలీం మండిపడ్డారు. బుధవారం ఆయన స్వగృహం ఉమ్మి ప్యాలెస్ నందు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం మద్రాసు కేంద్రంగా ఉన్నప్పుడు 1950లో ఏపి ఎన్జీవో రాసుకున్న మదర్ డాక్యుమెంట్ బైలా 2 ప్రకారం, ఏపి ఎన్జీఓకి సంబంధించినటువంటి స్థలం అమ్మకానికి వీల్లేదు..ఎవరికి బాడుగకు ఇవ్వడానికి వీల్లేదని..స్పష్టంగా రాసి ఉందన్నారు. అలాగే ఆదోనిలో ఈ స్థలం కొనుగోలు విషయంలో 1965లో అప్పటి ఏపి ఎన్జీఓలు 6వేల మంది ఉద్యోగులు కొంతమేర డబ్బు సర్దుబాటు కాలేకపోతే, అప్పట్లో ఉద్యోగులందరు కలిసి సినీనటులు గుమ్మడి వెంకటేశ్వరరావు, హీరోయిన్ భారతి దగ్గరికి వెళ్లి డబ్బులు అడుగగా మేము డబ్బులు ఇవ్వలేము కానీ మీ ఊరు ఆదోనిలో ఒక నాటకం చేస్తాము ఆ వచ్చిన టికెట్ల డబ్బులతో ఏపిఎన్జీఓ హోం కొనుగోలు చేసుకోండి అంటూ అప్పట్లోనే పెద్ద పెద్ద వారు ఏపి ఎన్జీఓ హోం కొనుగోలుపై ఇలా అనేక రకాలుగా సాయం చేస్తే నేడు ఇద్దరు వ్యక్తులు రూ.కోట్లు విలువైన స్థలం కేవలం రూ.40లక్షలకు ఏపి ఎన్జీఓ స్థలాన్ని బాడుగకు ఇచ్చి



డాక్యుమెంట్ నెంబర్ 98/2021న 99సం॥లు ఆదోని శాసనసభ్యులైన వారి బినామీకి ఎలా రిజిస్టర్ అగ్రిమెంట్ చేయిస్తారని వ్యాఖ్యానించారు. ఈ స్థలంలో వైసిపి పార్టీ కార్యాలయం అసెంబ్లీ మాదిరిగా కట్టించి సెటిల్మెంట్ల అడ్డాగా చేశారని ఆరోపించారు. 99సం॥లు అగ్రిమెంట్ అంటే సుమారు రెండు, మూడు తరాలు ఇప్పటి నుంచి లెక్కపెట్టినా ఈ అగ్రిమెంట్ పూర్తయ్యేలోపు ఈ భూమి మీద ఎవరు బతికుండము అంటే భవిష్యత్తులో ఈ స్థలం వాడుకలో మా రెడ్డిది..మా రెడ్డిది..మా రెడ్డిది..అంటూ తరతరాలు చెప్పుకుంటూ చివరికి వారికి సొంతం కావాలనే దురుద్దేశ్యంతో ఇలాంటి పనులకు శ్రీకారం చుట్టారని అర్థమవుతుందన్నారు. ఈ విషయంపై నేను కోర్టులో వీరందరిపై పిల్ వేసి చర్యలు తీసుకునే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మహమ్మద్ పీర్, సమీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే,ఎం.పి.



**వెలుగోడు, జనవరి 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో రూ.185.75లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మనందరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతున్న నిరంతరం ప్రజా శ్రేయస్సు, ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10 పడకలతో కూడినదని మెరుగైన ఆరోగ్య సేవలను ప్రజలకు అందించాలని ఆరోగ్య సేవలను అందించాలని వైద్యులకు ససూచించారు. త్వరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల చికిత్సలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిఅరు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, వైద్య బృందం, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిరాణా షాపు యజమానిని ఆదుకుంటాం

**:-వైసిపి యువనేత ప్రదీప్‌రెడ్డి**



**సుంకేశ్వరి(మంత్రాలయం), జనవరి 3, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ఈడిగ గోపాల్ అనేవ్యక్తి కిరాణా షాపు దగ్ధమయ్యింది. సమాచారం తెలుసుకున్న వైసిపి యువనేత వై.ప్రదీప్‌రెడ్డి ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం దగ్ధమైన కిరాణా షాపును పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో బాధితులను అడిగి తెలుసుకున్నారు. కిరాణాషాపు యజమానికి అన్నివిధాలా అండగాఉండి ఆదుకుంటామని ప్రదీప్‌రెడ్డి హామీ ఇచ్చారు. వీరివెంట వైసిపి సేవాదల్ నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, సర్పంచ్ ముక్కరన్న ఉన్నారు.

## ప్రతిపక్ష పార్టీల వారిపై తప్పుడు కేసులు, అరెస్టులు చేయడం పరిపాటిగా మారింది



**కర్నూలు న్యూసిటీ, జనవరి 2, ప్రభాతవార్త:** ప్రశ్నించిన ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం, వేధింపులకు గురిచేయడం అధికార పార్టీకి అలవాటుగా మారిందని కర్నూలు జిల్లా టిడిపి పార్లమెంటు అధ్యక్షులు బిటి నాయుడు పేర్కొన్నారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిన జగన్ ప్రభుత్వ అరాచకాలను, అన్యాయాలను కూల్చివేతలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 25న కర్నూలు పార్లమెంటు పరిధిలోని పత్తికొండకు విచ్చేయుచున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేద్దామన్నారు. నాలుగు సంవత్సరాల 8 నెలల కాలంలో జగన్ ప్రభుత్వం చేయని అరాచకమంటూ లేదని వారి భారీన పడిన ప్రజలు దిక్కుతోచక అల్లాడిపోతున్నారని వారికి భరోసా నిచ్చి వారి మద్దతును కూడగట్టేందుకు నారా చంద్రబాబు నాయుడు ప్రజల మధ్యకు మరోసారి రానున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలు, వ్యాపార, మరియు పారిశ్రామిక వేత్తలపై వేధింపులు, ప్రశ్నించిన వారిపై కేసులు, అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. అనునిత్యం ప్రజల కోసం పరితపించే చంద్రబాబు నాయుడు తిరిగి ప్రజల మధ్యకు వచ్చేందుకు నిర్ణయించుకొని పర్యటన ఖరారు చేసుకున్నారని వారి కార్యక్రమంలో భాగంగా పత్తికొండలో నిర్వహించే రా.. కదలిరా... బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు విరివిగా హాజరయి సభను విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. జగన్‌కు ఓటు వేసి గతంలో చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం మీకు వచ్చిందని మీ ఓటు అనే ఆయుదంతో బుద్ధిచెప్పి జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీని గెలిపించాలని బిటి నాయుడు పిలుపునిచ్చారు.

## గ్రామసభల్లో 5వతేది నుండి రీసర్వే సమస్యలపై అర్జీలు స్వీకరిస్తాం

**– జాయింట్ కలెక్టర్**



**నంద్యాల, జనవరి 03, ప్రభాతవార్త:** ఈనెల 5వ తేది నుండి 10వ తేది వరకు గ్రామసభల్లో రీ సర్వే సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో జగనన్న శాశ్వత హక్కు, భూరక్ష పథకం కింద రీ సర్వే పూర్తయిన మొదటి విడతలో 11గ్రామాలు, రెండవ విడతలో 73 గ్రామాలు గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. గ్రామ సభ షెడ్యూల్, అర్జీలు స్వీకరించే ప్రదేశం, తదితర వివరాలను దండోరా ద్వారా, పత్రికా ప్రకటనల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తహాశీల్దార్లను జేసీ ఆదేశించారు. ఎవరైనా గ్రామసభల్లో అర్జీలు అందించలేకపోతే రీ సర్వే సభ్యులు ఈనెల 16వ తేది వరకు అర్జీలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన అర్జీలను ఈనెల 17 నుండి 21వ తేదిలోపు రీ సర్వేపై పునః సమీక్షించి సంబంధిత నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపాలని జేసీ ఆదేశించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తిమృతి

**మంత్రాలయం, జనవరి 3, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్‌జిల్లా, మద్నూర్ పట్టణానికి చెందిన బఖరే ఖుషాల్(38) రాత్రి సమయంలో రోడ్డుపై వెళుతుండగా వెనుక నుండి ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం సమాచారం తెలుసుకున్న మంత్రాలయం సిఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ వ్యక్తిని మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించినట్లు తెలియజేశారు. ఈ ప్రమాదంలో వ్యక్తి శరీరం నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.